

# కళా సాగరం

**కొడవటిగంటి కుటుంబరావు**

అభూత కల్పన

"ఇదే కళాసాగరం", అన్నాడు నా గైడ్.

సాగరం అతిశయోక్తిలాగా కనబడింది. సరస్సు అనవచ్చు. అవతలి ఒడ్డు కనిపిస్తున్నది.

"మేం దీన్నే మహాసముద్రంగా భావిస్తున్నాం. కళాచెరువులూ, కళాబావులూ, కళాగుంటలూ, అందులో కూర్చుని బెకబెకలాడే కళాకప్పలూ చూసినవారికి ఇది మహాసాగరం కాదుటండీ, గురూగారూ ?" అన్నాడు గైడ్.

"కనీసం లోతైనా అట్టే ఉన్నట్టు కనిపించదే ?" అన్నాను.

"ఎంతమాటన్నారండీ ! ఇందులో చాలామంది మునిగిపోయారండీ !" అన్నాడు గైడ్.

"మరీ పొట్టి సజ్జేమో ?"

"అదీ ఉందనుకోండి ! ఈత రాక పోవటం ఉందనుకోండి ! ... చిల్లి పడవల్లో పోవటమూ ఉందనుకోండి ! పడవలవాళ్ళు ముంచెయ్యటమూ ఉందనుకోండి !"

"అదోటా ?"

"అవును, గురూగారూ ! అవతలొడ్డుచేరితే మంచి గిట్టుబాటు గదండీ ? పడవ మాట్లాడుకున్న వాడిదగ్గిర ప్రయాణం పూర్తిచేసే తైలం లేదని తెలిస్తే, వాడి తైలం అయిపోగానే పడవని తిరిగి సొంతంచేసుకుని, వాణ్ణి నడిసముద్రంలో ముంచేసి, అవతలి ఒడ్డుచేరి ప్రైజుకొట్టేస్తారు. వ్యాపార ధర్మం అంతే గదండీ ?"

"వ్యాపార ధర్మం ఏమిటి ? ప్రైజు ఏమిటి ? రెంటికీ పొంతన కుదురుతుందా ?" అన్నాను.

"కుదిరేట్టు చూసేటందుకు ప్రజలున్నారు లెండి."

నాకు అవతలి ఒడ్డుకు పోవాలనిపించింది. అసలు సారస్యం అక్కడే ఉన్నట్టు నాకు తోచింది.

"పడవ కొనే తాహతుందా ? మధ్యలో పడవ మునిగితే ఈదగలరా?" అన్నాడు నా గైడ్.

"ఎందుకయ్యా ? చుట్టూ తిరిగి పోదాం. ఎంతోసేపు పట్టదు", అన్నాను.

నేను అనుకున్నది నిజం. అసలు హడావుడంతా అవతలి ఒడ్డునే ఉన్నది. జనం – హర్షధ్వానాలు – వెటకారాలు – వెక్కిరింతలు – మీటింగులు – కొట్లాటలు !


జనం మధ్యగా తిరుగుతూ, చెవుల్లో కలాలూ, ఆచేతిలో కాగితాలూ పట్టుకుని తిరుగుతున్నవాళ్లు కనిపించారు.

"వాళ్ళెవరు ?" అని అడిగాను.

"జర్నలిస్టులు. ఒక్కో పడవ ఒడ్డుకు చేరినప్పుడల్లా వాళ్ళు బాకాలూదుతారు. అవతలి పక్కనుంచి ఏ పడవ ఎప్పుడు బయలుదేరిందీ, అది ఎంతదూరం వచ్చినదీ, ఉజ్జాయింపుగా ఎప్పుడు ఒడ్డు చేరేదీ, లౌడ్‌స్పీకర్లలో చెబుతుంటారు. మధ్య ఏ పడవైనా ఆగిపోయినా, మునిగిపోయినా దాని ఊసెత్తరు. ఒడ్డుచేరినవాళ్లకు సన్మానాలూ అవీ ఏర్పాటయినా, కళాసాగర తరుణంలో కృతకృత్యులైనవాళ్ళు వెలిబుచ్చే అమూల్యమైన అభిప్రాయాలు అశేషజనానీకానికి తెలిసి, వాళ్ళు ధన్యులు కావాలన్నా, జర్నలిస్టుల సహకారం విధిగా ఉండితీరాలి."

"అబ్బా ! చాలా శ్రమపడతారన్న మాట !" అన్నాను.

"జర్నలిస్టు జాతికి వీళ్ళు రాజులు కారటండీ ? తెలివైన జర్నలిస్టు తెలివితక్కువ కళావ్యాపారికన్న ఎక్కువ సంపాదిస్తాడు. రెక్కలపురుగుల్లాగా వీళ్ళు కళాచీకట్లకు దూరంగానూ, కళా




దీపాలకు వీలయినంత దగ్గిరగానూ ఉంటారు."

"వీళ్ళ కింత ప్రాముఖ్యం ఎట్లా వచ్చి ఉంటుంది ?" అని అడిగాను.

"ఒకప్పుడు ఈ కళాసాగరం బుల్లి చెరువంత ఉండేది. ఆ మాట నిజం కూడా లెండి. దీన్ని మహాసముద్రంగా చేసింది మేమే నంటున్నారు జర్నలిస్టులు. కాదని ఎవరూ అనలేదు."

కళాసాగరంమీదికి దృష్టిసారించాను. వచ్చే పడవల్లో చాలామంది ఉన్నట్టు కనబడింది. వాళ్ళంతా ఎవరు ?

"వాళ్లు నక్షత్రాలు. పడవలు మునిగినా వాళ్ళు మునగరు", అన్నాడు నా గైడ్.

"బాగా ఈదుతారు కాబోలు."

"అదీనున్నూ, వాళ్లసలు నీటిలో మునగరు. చాలా తేలిక !"

"అలా చెప్పు ! ఎంత అదృష్టం ? పడవలు మాట్లాడుకునేవాళ్ళు అంత తేలిగ్గా ఉంటే ఎంత బాగుణ్ను ?" అన్నాను.

"అదేవిటి, గురూగారూ ? అలాటి వాళ్లు చాలామంది ఉన్నారు. పది పడవలు వరసగా మునిగినా పదకొండో పడవను సంపాదించగల వాళ్ళున్నారు ! వాళ్ల పరపతి అలాటిది ! నిజానికి కళాసాగరాన్ని ఈదటం ఒక గొప్ప కళ, విద్య ! అది తెలిసినవాళ్ళు కళలో మునిగి తేలగలరు ! చాలా తేలిక !"

"అరె, ఇక్కడెవరో కొట్లాడుకుంటున్నారు, దేనికో ?" అన్నాను.

"దూరంగా భుజాలమీద చేతులు వేసుకుని పోతున్న నక్షత్రాలను చూశారా ? వాళ్ల అభిమాన సంఘాల వాళ్ళు. ఎవరి నక్షత్రం వాళ్ల కెక్కువ. ఏమంటారు ?"

"నక్షత్రాలు సఖ్యంగానే ఉన్నారే?" అన్నాను.

"అంత అమాయకంగా మాట్లాడతారేవిటి, గురూగారూ ? ఇద్దరు రాజులు యుద్ధం చేస్తారు. అటూ ఇటూ జనం చస్తారు. రాజులిద్దరూ సంధి అని చెప్పి షేక్‌హాండ్ చేసుకుంటారు. ఓ జాతకంలో రెండు గ్రహాలకు షష్టాష్టకం అవుతుంది. వాడు పురుగుతాకి పోతాడు. గ్రహాలకేం ? అవి బాగానే ఉంటాయి. ఏమంటారు ?" అన్నాడు నా గైడ్.

"నన్ను ఇంతదూరం తెచ్చావుగాని, నా కివేమంత నచ్చలేదు, తమ్ముడూ", అన్నాను.

"ఇంతకన్న బాగున్నదేదో ఒకటి చెప్పండి."

"మా ఊరి కళాచెరువు ఎంత అందంగా ఉంటుందనుకున్నావు ? ప్రశాంతంగా, చల్లగాలి వీస్తూ పక్షులు పైగా ఎగురుతూ– దాని పక్కన ఎంతసేపు కూర్చున్నా ప్రాణం లేచివచ్చినట్టుంటుంది గాని, ఇలా బుర్ర ఖరాబైపోదు."

"మీరలా అన్నారు గనక నన్నో మాట చెప్పనిస్తారా ? మీ కళాచెరువు కప్పలు ఈ కళాసాగరంలో ఘనంగా బతకాలని వస్తున్నాయో మీకు తెలుసా ?"

"నాకు తెలీదు", అని ఒప్పుకున్నాను.

"చూస్తూండండి. అన్ని కళాగుంటలూ, కళాబావులూ, కళాచెరువులూ పాడుబడిపోతాయి. ఈ కళాసాగరం మహాసముద్రమై, ఒక ఒడ్డు నుంచి ఇంకో ఒడ్డు కనబడకుండాపోయే రోజు వస్తుంది– సంస్కృతి అంటే దీని ఒడ్డునే చూడాలన్న రోజు ఎంతో దూరంలో లేదు", అన్నాడు నా గైడ్.

ఏదో అందామనుకున్నాను గాని, తీరా అనటానికి ఏమీలేదని గ్రహించాను.